క్లుప్తంగా

ఎయిడ్స్ నివారణపై అవగాహన



కళా ప్రదర్శన ద్వారా అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పిఠాపురం: రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో పిఠాపురంలో శుక్రవారం ఎయిడ్స్ నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సభ్యుడు రమేష్ ఆదేశాలతో కేవీఆర్ శైలజ చేంజెస్ కాకినాడ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక గొల్లప్రోలు టోల్‌గేట్, బస్టాండ్ ప్రాంగణంలో వీధి నాటకం చేపట్టారు. హెచ్ఐవీ ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది? సుఖ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. గొల్లప్రోలు నగర పంచాయతీ మేనేజర్ నవీన్‌చంద్ర, ప్రైమరీ హెల్త్ సెంటర్ హెల్త్ విజిటర్ బాషా, అర్బన్ హెల్త్ సెంటర్ హెల్త్ విజిటర్ పి.లక్ష్మీరావణమ్మ, ఐసీటీసీ కౌన్సిలర్ ఎస్.లక్ష్మీసరస్వతి, పి.దుర్గాభవాని, చేంజెస్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీలక్ష్మీ చేంజెస్ కాకినాడ సంస్థ సిబ్బంది శివా, సునీత, నాగదుర్గ, సరోజ, నారాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల పరిశీలన



ఇంటర్ పరీక్షలను పరిశీలించిన డైట్ డీఐఈడీ శారద తదితరులు

సామర్లకోట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షల తీరును జిల్లా డైట్ డీఐఈడీ ఐ.శారద శుక్రవారం పరిశీలించారు. కళాశాలలో జరుగుతున్న పరీక్షలపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడానికి పలు సూచనలు ఇచ్చారు. పరీక్ష కేంద్రం వద్ద అమలవుతున్న 144 సెక్షన్‌ను ఆమె పరిశీలించి పోలీసులకు సూచనలిచ్చారు. శుక్రవారం పరీక్షకు 353 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 11 మంది గైర్హాజరైనట్టు ప్రిన్సిపాల్ చంద్రు లీలావతిదేవి డీఐఈడీకి తెలిపారు.

ఖేలో ఇండియాలో అచ్చంపేట విద్యార్థి



ఖేలో ఇండియా బాడ్మింటన్ పోటీల్లో విజేతలు

సామర్లకోట: బీహార్‌లో ఈనెల 13వ తేదీన జరిగిన ఖేలో ఇండియా యూత్ బ్యాడ్మింటన్‌లో మండలం అచ్చంపేటకు చెందిన వీరంరెడ్డి హరికృష్ణ జోడి డబుల్స్‌లో విజయం సాధించి ప్రథమ బహుమతి పొందాడు. ఈ మేరకు హరికృష్ణ తండ్రి వీరంరెడ్డి పెదబాబు శుక్రవారం స్థానిక విలేకర్లకు వివరాలు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన టి.రామ్‌చరణ్, వీరంరెడ్డి హరికృష్ణ జోడి, తమిళనాడుకు చెందిన విశ్వజిత్‌రాజ్, నీరంజన్‌పై 19–21, 21–19, 21–16 తేడాతో విజయం సాధించారన్నారు.

చర్చి ప్రారంభం

కొత్తపల్లి: ఉప్పాడలో కొత్తగా నిర్మించిన ఫుల్ గాస్పల్ చర్చి ఆఫ్ క్రైస్ట్‌ను శుక్రవారం ప్రారంభించారు. స్థానిక పాస్టర్‌లు బీఎల్ రాజబాబు, జి.స్టీఫెన్ రాజు, సంఘం సభ్యుల ఆధ్వర్యంలో నిర్మించిన ఈ చర్చిని రాజమహేంద్రవరానికి చెందిన హోసన్నా మినిస్ట్రీస్ పాస్టర్ జాన్ వెస్లీ ప్రారంభించారు.

బాధితుడికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందుకుంటున్న దుర్గాప్రసాద్

సామర్లకోట: మండల పరిధిలోని హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన పుప్పాల పూర్ణ దుర్గాప్రసాద్ కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ మేరకు కాకినాడలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వైద్య ఖర్చులకు ఇబ్బంది పడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప రూ.50 వేలు ఆర్థిక సాయం ఏర్పాటు చేశారు. ఈ మొత్తాన్ని గ్రామానికి చెందిన చల్లా బుజ్జి, కోట అప్పారావు, మార్ని సూర్యారావు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

19న జాబ్‌మేళా

కాకినాడ సిటీ: స్థానిక వికాస కార్యాలయంలో 19న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. జాబ్ మేళాలో ఐటిక్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్‌లో టెక్నికల్ సపోర్టు ఎగ్జిక్యూటివ్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, ఐటీసీ లిమిటెడ్ ఫుడ్స్ డివిజన్‌లో ఆపరేటర్, మోడిన్ థర్మల్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో అప్రెంటిస్, కేఎఫ్‌సీలో టీమ్ మెంబర్స్, ఇండో ఎంఐఎం, హుండాయ్ గ్లోవీస్, పానాసోనిక్ అండ్ ఇసుజు మోటార్స్ కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన 35 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులన్నారు.

అన్నీ మట్టి మాటలండోయ్!

- మట్టి మాఫియాకు 'కూటమి' అండ
- పాపిడిదొడ్డి చెరువులో తవ్వకాలకు సన్నాహాలు
- వ్యతిరేకించిన రైతులు



మట్టి తవ్వకాలకు వ్యతిరేకంగా ఎఫ్‌కేపాలెం పాపిడిదొడ్డి చెరువులో అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న రైతులు, కార్మికులు

పిఠాపురం: మట్టి మాఫియా అంతు చూస్తామంటూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఎన్నికల ముందు ఆవేశంగా చెప్పిన మాటలు వట్టి మాటలుగానే మిగిలిపోతున్నాయని రైతులు అంటున్నారు. ఒకపక్క మట్టి మాఫియాను ప్రోత్సహించేది లేదంటూ పవన్ చెబుతుంటే, కూటమి నేతలు ఆయన నియోజకవర్గంలోనే మట్టి మాఫియాకు రంగం సిద్ధం చేయడాన్ని రైతులు, ఉపాధి కూలీలు దుయ్యబడుతున్నారు. పెద్ద మొత్తంలో మట్టి దోపిడీకి రంగం సిద్ధం చేస్తుంటే అధినేతలు ఎందుకు పట్టించుకోడం లేదంటూ ప్రశ్నిస్తున్నారు. పవన్‌కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో కొందరు నేతలు భారీగా అక్రమ మట్టి తవ్వకాలకు సిద్ధపడుతున్నారని రైతులు చెబుతున్నారు. పిఠాపురం మండలం ఫక్రుద్దీన్‌పాలెం- విరవాడ గ్రామాల మధ్య సర్వే నంబర్–17లో సుమారు 80 ఎకరాల్లో ఉన్న పాపిడిదొడ్డి చెరువులో అక్రమంగా మట్టిని తరలించుకు పోవడానికి కూటమి పెద్దలు ప్రయత్నాలు సాగిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. చెరువును తవ్వి భారీగా మట్టిని తరలించుకుపోయేందుకు జనసేన పార్టీకి చెందిన కొందరు నేతలు సిద్ధంగా ఉన్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందులో భాగంగా ఇటీవల మట్టి తవ్వకాలు ప్రారంభించడానికి ఏర్పాట్లు చేయగా స్థానిక రైతాంగం అడ్డుకుంది. అధికార పార్టీ ముఖ్య నేతల కనుసన్నల్లో అక్రమ తవ్వకాలు, రవాణా జరిపేందుకు ఏర్పాట్లు చేయగా అడ్డుకున్న గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదులు చేశారు. పిఠాపురం మండలం ఎఫ్.కె.పాలెంలోని పాపిడిదొడ్డి చెరువులో కొందరు ఇటుక బట్టీల వ్యాపారులు అక్రమంగా మట్టిని తరలించుకుపోయేందుకు ఇప్పటికే సిద్ధపడ్డారని, యంత్రాలను అడ్డుకొని అక్రమ తవ్వకాలను నిలుపుదల చేయించామని స్థానిక రైతులు తెలిపారు. అయినా బట్టీ వ్యాపారులు తమ ప్రయత్నాలను నిలుపుదల చేయకపోవడంతో శుక్రవారం పాపిడిదొడ్డి చెరువు వద్ద రైతులు వినూత్న రీతిలో ఆందోళన చేపట్టారు. అర్ధనగ్న ప్రదర్శన ద్వారా తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక రైతులు జవ్వాది కృష్ణ మాధవరావు, ముమ్మిడి వెంకన్న బాబు, మలిరెడ్డి పల్లపురాజు, రెడ్డి సత్యనారాయణ, జీను స్వామి, ఎఫ్.కె. పాలెం కందరాడ గ్రామాల నేతలు ముమ్మిడి శేఖర్, సైతన ప్రసాద్ తదితరులు మాట్లాడుతూ తమ వ్యాపార స్వలాభాల కోసం కొందరు ఇటుకుల బట్టీ వ్యాపారులు గ్రామంలోని చెరువులో ఉన్న మట్టిని అక్రమంగా తరలించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఒక రైతు పేరుతో అనుమతి తీసుకుని పెద్ద ఎత్తున మట్టిని తరలించేందుకు రెడీ అయ్యారన్నారు. గ్రామానికి చెందిన సుమారు 300 మంది రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే చెరువు పెద్ద పెద్ద గోతులతో ఉండగా సాగునీరు సక్రమంగా అందడం లేదన్నారు. మళ్లీ చెరువులో మట్టి తవ్వకాలు జరిగితే ఏటా రైతులు భారీగా నష్టపోయే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో అధికారులు తమ సమస్యను గుర్తించి చెరువులో మట్టి తవ్వకాలను తక్షణమే నిలుపుదల చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఒక మహిళా రైతు పేరుతో అనుమతి తీసుకుని ఆ రైతుకు సంబంధం లేకుండా మట్టి మాఫియా వారు తమ బట్టీలకు మట్టిని తరలించుకొనేందుకు అధికారులను సైతం తమ వైపునకు తిప్పుకున్నారని వారు ఆరోపించారు. రైతుల సమస్యలను కాదని మట్టిని తరలిస్తే యంత్రాలను అడ్డుకుని తీరతామని తేల్చి చెప్పారు. కార్యక్రమంలో ముమ్మిడి చక్రరావు, వెన్నా అర్జునరావు, కర్రపోతుల నల్లయ్య, కృష్ణ, మత్య దొంగబ్బాయి, మత్య చిన్నోడు, సామిదాల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు. అయితే ఈ చెరువు విరవాడ, ఎఫ్‌కేపాలెం పంచాయతీల పరిధిలో ఉండడంతో గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులను ఉసిగొలిపి మట్టి తవ్వకాలు జరిపేందుకు కూటమి నేతలు ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



మట్టి తవ్వకాల కోసం వచ్చిన పొక్లెయిన్‌ను అడ్డుకుంటున్న రైతులు, కార్మికులు

మా పొట్టకొట్టొద్దు..

ఈ చెరువుపై ఆధారపడి వందల కుటుంబాలు జీవిస్తున్నాయి. దానిలోనే తమకు రోజూ పని దొరుకుతుందని, అలాంటి చెరువులో మట్టి తవ్వేస్తే తమకు పని ఉండదని పలువురు ఉపాధి కూలీల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన వందల మంది వ్యవసాయ కార్మికులకు ఈ చెరువు ఆధారంగా అధికారులు పనులు కల్పిస్తున్నారని, చెరువులో మట్టిని అక్రమంగా తరలించుకుపోతే ఉపాధి పనులు ఉండవని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి



వంగా గీతను కలుసుకున్న నేతలు

పిఠాపురం: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల్లో అధ్యక్షులుగా నియమించబడిన నాయకులంతా పార్టీ మరింత బలోపేతానికి కృషి చేయాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎంపీ వంగా గీత సూచించారు. పిఠాపురం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా నియమితులైన వర్ధినీడి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు వర్ధినీడి సుజాతలు శుక్రవారం వంగా గీతను మర్యాద పూర్వకంగా కలుసుకుని కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారిని అభినందించి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని, పార్టీ కోసం అహర్నిశలూ పాటుపడాలని సూచించారు.

సమస్యలు పరిష్కరించాలి

- మున్సిపల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఉండవిల్లి
- నిరసన దీక్ష, సమ్మెకు దిగిన ఇంజినీరింగ్ విభాగం కార్మికులు



సామర్లకోటలో దీక్షలు ప్రారంభించిన మున్సిపల్ ఔట్ సోర్సింగ్ ఇంజినీరింగ్ కార్మికులు

సామర్లకోట: మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగంలోని కాంట్రాక్టు కార్మికులు శుక్రవారం సమ్మె ప్రారంభించారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఈ నెల 7వ తేదీ నుంచి నల్లబ్యాడ్జీలు ధరించి సమ్మెలోకి దిగారు. అయినా మున్సిపల్ అధికారులు, పాలకుల నుంచి ఎటువంటి స్పందన లేక పోవడంతో మున్సిపల్ కార్యాలయం ఎదురుగా దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక మున్సిపల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఉండవిల్లి రామరాజు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఆరు నెలల క్రితం కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేశామని, అపుడు వాటి పరిష్కారానికి మూడు నెలల సమయం కోరారని, ఇప్పటికి ఆరు నెలలు గడిచినా అధికారులు స్పందించకపోవడంతో విధిలేని పరిస్థితిలో సమ్మెకు వెళ్లినట్టు ఆయన తెలిపారు. 15 ఏళ్ల సీనియారిటీ ఉన్న వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, విధి నిర్వహణలో చనిపోయిన వారికి రూ.10 లక్షలు నష్ట పరిహారంతో పాటు కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని, ఏడాదిలో 55 ఆదివారాలు, కేంద్ర, రాష్ట్ర పండగలకు 17 రోజులు సెలవులు ఇవ్వాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, సీనియార్టీ ప్రాతిపదికలో వేతనాలు చెల్లించాలని, స్కిల్డ్ వర్కర్లకు రూ.29,200, నాన్ స్కిల్డ్ వర్కర్లకు రూ.24,500 వేతనాలు ఇవ్వాలనే డిమాండ్లు ప్రభుత్వం వద్ద ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించక పోతే 20వ తేది నుంచి పారిశుధ్య కార్మికులు కూడా సమ్మెలోనికి దిగుతాయని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పులపకూర రామకృష్ణ, లంక శ్రీహరి, నక్క రత్నంరాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ చేనేత విభాగ అధ్యక్షుడిగా హరిబాబు



గోపి హరిబాబు

కొత్తపల్లి: పిఠాపురం నియోజకవర్గ చేనేత విభాగ అధ్యక్షుడిగా గోపి హరిబాబును నియమించినట్లు శుక్రవారం వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్ తెలిపారు. పిఠాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ వంగా గీతా విశ్వనాథ్ సిఫార్సు మేరకు పార్టీ అధిష్టానం ఈ నియామకం చేపట్టిందన్నారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో చేనేత కార్మికుల అభివృద్ధికి వైఎస్సార్ సీపీ తరఫున పనిచేస్తానన్నారు. తనపై నమ్మకంతో చేనేత విభాగ అధ్యక్షుడిగా నియమించినందుకు వంగా గీతకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పోక్సో చట్టంపై అవగాహన



బాలికలకు అవగాహన కల్పిస్తున్న దుర్గారాణి

పిఠాపురం: పోక్సో చట్టం పట్ల బాలికలు అవగాహన పెంచుకోవాలని జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి సూచించారు. పిఠాపురం ప్రాజెక్టు సీడీపీఓ సీహెచ్ ఎస్‌కే దుర్గాదేవి ఆధ్వర్యంలో శుక్రవారం మల్లాంలో కిశోరి వికాసం సమ్మర్ క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గారాణి మాట్లాడుతూ వైద్యారోగ్య సిబ్బంది అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బాలల హక్కులు, బాలల లైంగిక వేధింపుల నిషేధిత చట్టం (పోక్సో) గురించి వివరించారు. ఈ కార్యక్రమాలు జూన్ 10 వరకూ కొనసాగుతున్నాయని తెలిపారు.

ఏఎన్ఎం ఆత్మహత్యాయత్నంపై విచారణ

కొత్తపల్లి: నిద్రమాత్రలు మింగి ఏఎన్ఎం ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటనపై విచారణ నిర్వహించినట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. కొమరగిరి పీహెచ్‌సీ పరిధిలో కొండెవరం గ్రామ విలేజ్ కార్యదర్శిగా పనిచేస్తున్న ఏఎన్ఎం వి.దుర్గాదేవి గురువారం నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. దీనిపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొమరగిరి పీహెచ్‌సీ వైద్యాధికారి, ఎంపీహెచ్‌ఓతో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులను విచారించినట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు. పిఠాపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో దుర్గాదేవి చికిత్స పొందుతుందన్నారు.

వైభవంగా శ్యామలాంబ జాతర

- భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు
- గొంచాలలో భారీ అన్నదానం



గొంచాల గ్రామంలోని శ్యామలాంబ అమ్మవారు



శ్యామలాంబ అమ్మవారి ఆలయంలో మహిళల సామూహిక కుంకుమ పూజలు

సామర్లకోట: మండల పరిధిలో గొంచాల గ్రామంలో కొలువైన శ్యామలాంబ జాతర ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. భక్తులు ఆలయ కోనేరులో స్నానాలు చేసి అనంతరం నైవేద్యాలు పెట్టుకున్నారు. గ్రామంలో ప్రతి కుటుంబంలోని బంధువులతో ఆనందంగా గడిపారు. తెల్లవారు జామున తాడితో ఊరేగింపు నిర్వహించారు. గ్రామం అంతా ఊరేగింపు నిర్వహించిన తరువాత ఆలయం వద్ద తాడి గోతిలో పాతి తిప్పుతూ యువత ఉత్సాహంగా కేరింతలు కొట్టారు. అమ్మవారికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకం చేశారు. వివిధ సాంస్కృతిక ప్రదర్శనలతో అమ్మవారి జాతర జరిగింది. ఆలయం వద్ద పెద్ద ఎత్తున మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. అమ్మవారి జాతరను పురస్కరించుకుని ఆలయం వద్ద తిరునాళ్ల నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున అన్నదానం చేశారు. అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం రోజున జాతర రావడంతో గొంచాల, నవర, పవర, చంద్రంపాలెం, అచ్చంపేట, పి.వేమవరం, ఉండూరు గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ నాయకులు భక్తులు సేవలందించారు. ఆలయం వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా సీఐ ఎ.కృష్ణ భగవాన్ ఆధ్వర్యంలో ఎస్సై రమేష్‌బాబు బందోబస్తు నిర్వహించారు. ఈఓ కృష్ణారెడ్డిని ఆలయ కమిటీ నాయకులు ఘనంగా సత్కరించారు.

21న అభయాంజనేయ విగ్రహ ప్రతిష్ఠ

సామర్లకోట: పెద్దాపురం పట్టణంలో ఈనెల 21వ తేదీన అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ చేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. పెద్దాపురం మున్సిపల్ సెంటర్‌లో కొలువైన కనకదుర్గ అమ్మవారి ఆలయ సమీపంలో జిగిని లక్ష్మణరావు, వెంకట శేషవేణి దంపతులు, జిగిని రాజేష్‌ఖన్నా, గౌతమి దంపతులచే విగ్రహ ప్రతిష్ఠ ఉంటుందన్నారు. దీనిలో భాగంగా ఈ నెల 20వ తేదీ ఉదయం స్వస్తివాచకం, సంకల్పం, పుణ్యాహవచనం, దీక్షాధారణ, క్షీరాధివాసం, ప్రధాన హోమం, గోపూజలు వేదపండితులు వాడపల్లి గోపాలచార్యులుచే జరుగుతాయని తెలిపారు. 22వ తేదీన హనుమజ్జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలన్నారు.

నాటు సారా స్వాధీనం

సామర్లకోట: పెద్దాపురం ఎక్సైజ్ అధికారులు శుక్రవారం వివిధ గ్రామాల్లో దాడులు చేసి 60 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారిని పెద్దాపురం కోర్టులో హాజరు పరచినట్టు ఎక్సైజ్ సీఐ కేవీపీ దుర్గార్జునరావు ఒక ప్రకటనలో తెలిపారు. జగ్గంపేట మండలం జె.కొత్తూరు గ్రామంలో నాటు సారా తయారు చేస్తున్న వ్యక్తిని అదుపులోనికి తీసుకుని అతని వద్ద నుంచి 20 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అలాగే గోవిందపురం గ్రామానికి చెందిన వ్యక్తి నుంచి 40 లీటర్ల సారాను, వెయ్యి లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు తెలిపారు. ఈ మేరకు ఇద్దరిని పెద్దాపురం కోర్టుకు హాజరు పరచగా రిమాండ్ విధించారన్నారు. ఈ దాడులల్లో ఎక్సైజ్ ఎస్సై ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

సామర్లకోట: పెద్దాపురంలోని శతాబ్ది పార్కు ఎదురుగా ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులను పురస్కరించుకుని శనివారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీ ఈపీ డీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఏపీఎస్ డీఎస్ ప్రభాకర్ శుక్రవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. నవోదయ, ఎన్టీఆర్ కాలనీ, రాజీవ్ కాలనీ, సీహెచ్‌సీ, దర్గాసెంటర్, మెయిన్‌రోడ్డు, మరిడమ్మ ఆలయం, తాడితోట, పాత పెద్దాపురం, గౌరీ కొనేరు, వ్యాపార పుంత, ఆర్బీ కొత్తూరు రోడ్డు, సినిమా సెంటర్, శివాలయ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

నేడు స్వచ్ఛ దివస్

సామర్లకోట: స్థానిక మున్సిపాలిటీ పరిధిలో ప్రతి మూడో శనివారం నిర్వహిస్తున్న స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్‌ను ఈ వారం బలుసులపేట ఇందిరా కాలనీలో కొనసాగించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య శుక్రవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, మహిళా సంఘాల ప్రతినిధులు హాజరుకావాలన్నారు. వేసవి కాలంలో ఎండలను దృష్టిలో ఉంచుకుని తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించనున్నట్టు తెలిపారు.

వనరులను రక్షించండి

కాకినాడ సిటీ: జిల్లాలో నీటి వనరులైన చెరువులు, కాలువలు, డ్రైన్లు, వాగులు తదితరాలు ఆక్రమణలకు, ధ్వంసానికి గురి కాకుండా కాపాడాలని జేసీ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం కలెక్టరేట్ కోర్టు హాలులో నీటి వనరుల సంరక్షణపై రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటైన జిల్లా స్థాయి పర్యవేక్షక కమిటీ తొలి సమావేశం జేసీ మాట్లాడారు. ఆక్రమణలు, దుర్వినియోగాల వల్ల జలవనరులు అంతరించి దుష్పరిణామాలకు దారి తీయకుండా నివారించేందుకు రెవెన్యూ అధికారుల అధ్యక్షతన మున్సిపల్, పంచాయతీ, ఇరిగేషన్, కాలుష్య నియంత్రణ తదితర శాఖల అధికారులు సభ్యులుగా జిల్లా, డివిజన్, మండల స్థాయిలో ఈ కమిటీలను ఏర్పాటు చేసిందన్నారు.

క్షణ క్షణం.. భయం భయం



ప్రమాదభరితంగా మారిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



అటెన్షన్ ప్లీజ్



కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు

పిఠాపురం: నిత్యం రద్దీగా ఉండే రహదారి అది.. ఆ దారిలో రోడ్డుకు చేర్చి ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండడం ప్రమాదకరంగా మారింది. అలాంటి ట్రాన్స్‌ఫార్మర్ కొంత కాలంగా మరమ్మతులకు గురై నిత్యం పేలి శబ్దాలు రావడంతో జనాన్ని పరుగులు పెట్టిస్తోంది. పిఠాపురం ఉప్పాడ సెంటర్ వన్‌వే రోడ్డులో స్టువర్ట్‌పేట వద్ద ఉన్న టాన్స్‌ఫార్మర్ నుంచి నిత్యం మంటలు, పొగలు వస్తూ వైర్లు కాలిపోతున్నా ఆ శాఖాధికారులు తాత్కాలిక మరమ్మతులు చేసి చేతులు దులుపుకొంటున్నారని స్థానికులు వాపోతున్నారు. దీనివల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకోవాలని కోరుతున్నారు.

నూతన విధానాలతో రైతులకు మేలు

- ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త సీతారామశర్మ



అవగాహన సదస్సుకు హాజరైన విద్యార్థులు

సామర్లకోట: రైతులు నూతన సాంకేతిక విధానాలను అమలు చేయడం ద్వారా మేలు జరుగుతుందని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ఎ.సీతారామశర్మ అన్నారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విద్యాలయం పరిధిలోని రాజమహేంద్రవరం, వ్యవసాయ కళాశాలలోని విద్యార్థులకు వ్యవసాయ పరిశోధనలపై వర్కుషాపు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దాపురం మండలం జె.తిమ్మాపురంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని రైతులు వ్యవసాయ నమూనాలు ప్రదర్శనకు ఉంచారు. వాటి ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. వ్యవసాయ రంగంలో ఆధునిక పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు ఉపయోగించడం వల్ల ఖర్చు తగ్గి దిగుబడి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏరువాక శాస్త్రవేత్త సుధీర్, సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్.దేవకుమార్, ప్రొఫెసర్ డాక్టర్ దక్షిణామూర్తి, కళాశాలలో అసోసియేట్ డీన్ డాక్టర్ డి.శ్రీనివాసు, తిమ్మాపురం, వడ్లమూరు, తాటిపర్తి అభ్యుదయ రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.